

గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడిన వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు

## శివునిపల్లిలో గంజాయి పట్టివేత

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 19: మండలంలోని శివునిపల్లి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఓ యువకుడి వద్ద 1.2కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఏసీపీ ఎస్.శ్రీనివాస్‌రావు కథనం ప్రకారం.. గురువారం శివునిపల్లిలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, తెలంగాణ క్రీడా ప్రాంగణం సమీపంలోని రైల్వే ఫ్లైఓవర్ కింద గంజాయి కలిగి ఉన్న ముగ్గురు పోలీసులను చూసి పారిపోతుండగా ఒకరిని పట్టుకున్నారు. ఇద్దరు పరారయ్యారు. పట్టుకున్న వ్యక్తిని తనిఖీ చేయగా 1.2 కిలోల గంజాయి లభించడంతో స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారించగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొత్తపల్లి గోరి గ్రామానికి చెందిన గజ్జి కొమురయ్య కుమారుడు గజ్జి సహదేవ రాజ్ అని తేలింది. అతడు ప్రస్తుతం హనుమకొండలో ఉంటూ గతంలో రేగొండ, హనుమకొండ, ఏన్కూర్ గ్రామాల్లో గంజాయి అమ్ముతూ కేయూ పోలీస్ స్టేషన్‌లో గంజాయి కేసు నమోదై జైలుకు వెళ్లి వచ్చాడని వివరించారు. గురువారం స్టేషన్ ఘన్‌పూర్‌లో గంజాయి ఇవ్వడానికి రాగా, అతడిని పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. అతడిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన సీఐ సట్ల రాజు, ఎస్సై నాగరాజు, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రవిప్రసాద్, కుమార్, మోహన్, అనిల్, రాఘవేందర్, హోంగార్డు శ్రీనులను ఏసీపీ అభినందించారు. తహసీల్దార్ డీ వెంకటేశ్వర్లు పంచనామా నిర్వహించారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**




★GNM నర్సులు, అనుభవం గల LAB టెక్నిషియన్స్ & OT అసిస్టెంట్స్ కావలెను. సంప్ర: గార్డియన్ హాస్పిటల్, ములుగు 'X' రోడ్, వరంగల్. 12 to 2PM
NTW-0305

★Receptionist & Pre primary teachers in School, Requirements: Female, Fluent English, Any Degree/ B.Tech, Salary: 5000/- to 8000/-, # Opp. Rio Water Plant, Gopalpur, HNK. 8309245271.
NTW-321569

★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-320501

**HMDA అప్రూవ్డ్ ప్లాటు**



★దసరా స్పెషల్ ఆఫర్! 5 గ్రా గోల్డ్ ఫ్రీ HMDA పరిధిలో ఇప్పుడే ఇల్లు కట్టుకొని ఉండటానికి తక్కువ ధరలోనే రెరా అప్రూవ్డ్ ఓపెన్ ప్లాట్స్ బ్యాంక్ లోన్, స్పాట్ రిజి: 8639545438.
NT-320354

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

| HANAMKONDA | WARANAGAL |
|---|---|
| 9182777563 | 9182777556 |
| 9182777618 | 9182777557 |
| 9182777213 | 9182777558 |

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565


# మరింత సులభంగా.. పారదర్శకంగా..

### ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక యాప్‌లు

జనగామ చౌరస్తా, అక్టోబర్ 19: అసెంబ్లీ ఎన్నికలు మరింత సులభతరంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఏడాది అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానానికి పెద్దపీట వేసింది. ప్రత్యేకంగా సీ విజిల్, సువిధ, కేవైసీ, బూత్, ఎన్‌కోర్, ఓటర్ హెల్ప్‌లైన్, పీపీఆర్‌టీఎంఎస్, ఓటరు టర్న్‌ఔట్, సాక్ష్యం ఆన్‌లైన్ యాప్‌లకు రూపకల్పన చేసింది. ఓటరు జాబితాలో పేరు, పోలింగ్ కేంద్రాన్ని గుర్తించడం, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యక్తిగత సమాచారంతోపాటు వారి నేర చరిత్రను తెలుసుకోవడం, ఎన్నికల ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల నామినేషన్, పరిశీలన, అనుమతుల కోసం, ముఖ్యంగా అక్రమ నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ అడ్డుకోవడానికి ఈ యాప్‌లను ప్రవేశపెట్టింది. స్మార్ట్ ఫోన్‌లో ప్లే స్టోర్ ద్వారా ఈ యాప్‌లను డౌన్ లోడ్ చేసుకొని తమకు అవసరమైన సేవలను వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. జిల్లాలోని జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వాహనకు జిల్లా ఎన్నికల అధికారి సీహెచ్ శివలింగయ్య నోడల్ అధికారులను నియమించారు. కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీ అండ్ ఐటీ విభాగానికి నోడల్ అధికారులను ప్రత్యేకంగా నియమించి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం, వ్యయాలు, ప్రచార అనుమతులు, అక్రమ నగదు, మద్యం రవాణాపై యాప్‌లతో మానిటరింగ్ చేస్తున్నారు. అత్యాధునిక సాంకేతికత వినియోగంపై ఎన్నికల విధుల్లో పాల్గొనే నోడల్ అధికారులు, సిబ్బందికి ఎన్నికల అధికారి శివలింగయ్య పలుమార్లు శిక్షణ పూర్తిచేశారు.



నోడల్ అధికారులకు శిక్షణలో కలెక్టర్ శివలింగయ్య

#### సీ విజిల్

సజావుగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు అడ్డుకోవడానికి ఈ యాప్ పనిచేస్తుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) ఉల్లంఘించే అభ్యర్థుల గురించి పౌరులు ఈ యాప్ ద్వారా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయవచ్చు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ జరుగకుండా దీని ద్వారా అడ్డుకట్ట వేయవచ్చు. అభ్యర్థుల ఎన్నికల కోడ్ ఉల్లంఘన వివరాలను ఎవరైనా సరే వీడియో తీసి ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయవచ్చు. ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లో ఎన్నికల విభాగం అధికారులు సంబంధిత వ్యక్తులపై చర్యలు చేపడతారు.

#### సువిధ

వచ్చే నెల నవంబర్ 3 నుంచి శాసన సభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానుండగా, అభ్యర్థులకు అవసరమైన అనుమతులు జారీ చేసేందుకు సువిధ యాప్ సింగిల్ విండో సిస్టమ్‌గా ఉపయోగపడుతుంది. అభ్యర్థులు భౌతికంగా లేదా సువిధ ఆన్‌లైన్ యాప్ ద్వారా తమకు అవసరమైన అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. 48 గంటల్లో నిర్వహించే సమావేశాలు, ర్యాలీల అనుమతి మంజూరుకు ఈ యాప్ పనిచేస్తుంది. ఇందులో ఇచ్చిన అనుమతి 72 గంటల పాటు పనిచేస్తుంది.

#### కేవైసీ

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యక్తిగత, నేర చరిత్ర వంటి సమాచారాన్ని ఈ యాప్‌తో స్మార్ట్ ఫోన్ లేదా ఐఓఎస్ ఫోన్ కలిగిన ప్రతి పౌరుడు తెలుసుకోవచ్చు.

#### బూత్

సీరియల్ నంబర్, ఈపీఐసీ నంబర్, పేరు ఆధారంగా జాబితాలో ఓటర్లను త్వరగా గుర్తించడానికి ఈ యాప్ ఉపయోగపడుతుంది. పోలింగ్ కేంద్రాల్లో సీరియల్ నంబర్ కోసం ఓటర్లు క్యూలైన్లలో ఎక్కువ సమయం నిలబడకుండా, వేగంగా ఓటు వేయడానికి ఈ యాప్ సహాయపడుతుంది. రంగుల ఫొటోలతో ఉన్న ఓటరు జాబితాలో ఓటరును త్వరగా గుర్తించడానికి, డూప్లికేటు ఓటు వేయకుండా నిరోధిస్తుంది.

#### సాక్షం

అంగవైకల్యం గల వారు ఓటరు జాబితాలో తమ పేరు నమోదు కోసం, పోలింగ్ రోజున ఓటు వేయడానికి ఈ యాప్ ద్వారా 'పిక్ అండ్ డ్రాప్' సౌకర్యాన్ని పొందడానికి ఉపయోగపడుతుంది. దివ్యాంగులు ఈ యాప్ ద్వారా వీల్ చైర్స్, ఎలక్టోరల్‌లో వారి పేరు, పోలింగ్ కేంద్రం, పోలింగ్ బూత్, అభ్యర్థి వివరాలు తెలుసుకోవచ్చు. ఫిర్యాదులు నమోదు చేయవచ్చు.

#### ఎన్‌కోర్

ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించడానికి ఎన్నికల సంఘం అభివృద్ధి చేసిన గొడుగు అప్లికేషన్ ఇది. అభ్యర్థుల నామినేషన్, వెరిఫికేషన్, అనుమతులు, ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కోసం ఈ యాప్ ఉపయోగపడుతుంది. బూత్ యాప్, ఓటర్ల డిజిటల్ మార్క్ కాపీ నుంచి క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించడం వల్ల వేగంగా ఓటరు గుర్తింపును సులభతరం చేస్తుంది. ఇది కూడా ఎన్‌కోర్‌లో ఒక భాగం.

#### ఓటరు హెల్ప్‌లైన్

ఓటరు జాబితాలో తమ పేరు వెతకడానికి, ఓటరు నమోదు, సవరణ ఫారాలు సమర్పించడానికి, డిజిటల్ ఫొటో ఓటరు స్లిప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి ఈ ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ఉపయోగపడుతుంది. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలు కనుగొనడానికి, ముఖ్యంగా వాస్తవాలు చూడడానికి, ఎన్నికల ఫలితాలు చూడడానికి ఈ యాప్ సహాయపడుతుంది.

#### పీపీఆర్‌టీఎంఎస్

రాజకీయ పార్టీ తన దరఖాస్తు సమర్పించిన తర్వాత ఒక ప్రత్యేక నంబర్ కేటాయిస్తారు. ఈ నంబర్‌తో మొబైల్‌లో ఆన్‌లైన్ ద్వారా తన దరఖాస్తు స్థితిని ట్రాక్ చేయడానికి ఉపయోగపడుతుంది. అన్ని రకాల వ్యత్యాసాలు ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తుదారుడికి సమాచారం తెలియజేస్తారు. ముఖ్యంగా రిజిస్ట్రేషన్ సమాచారం ఆన్‌లైన్‌లో సమాచారం ఇస్తారు.

#### ఓటరు టర్న్‌ఔట్

ఓటింగ్ శాతాన్ని తెలుసుకోవడానికి పౌరులు, మీడియా సంస్థలు ఉపయోగించే ప్రాథమిక పద్ధతి యాప్ ఇది.

#### ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక యాప్‌లు

జిల్లాలో ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక యాప్‌లకు రూపకల్పన చేసింది. వీటి ద్వారా ఓటరు జాబితాలో పేరు, సీరియల్ నంబర్, పోలింగ్ కేంద్రం వివరాలు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు అనుమతులు, వారి వ్యక్తిగత, నేర చరిత్ర వంటి సమాచారం, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే అభ్యర్థులపై పౌరులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. వీటిపై ఇప్పటికే నోడల్ అధికారులకు అవగాహన కల్పించాం. యాప్‌లో వచ్చే ఫిర్యాదులపై వంద నిమిషాల్లోగా స్పందించి తక్షణమే చర్యలు తీసుకుంటున్నాం. ఈ యాప్‌లను స్మార్ట్ ఫోన్‌లోని ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని కేంద్ర ఎన్నికల సంఘం అందించే అత్యాధునిక సాంకేతిక సేవల్నీ వినియోగించుకోవచ్చు.

*– సీహెచ్ శివలింగయ్య,*
*జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, జనగామ*

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



సుభాన్(ఫైల్)

దేవరుప్పుల, అక్టోబర్ 19: దేవరుప్పుల శివారు దాదాసాహెబ్ కాలనీలో గురువారం ఓ వ్యక్తి నీటి మడుగులో పడి మృతి చెందిన ఘటన వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన షేక్ సుభాన్(38) బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. గురువారం సాయంత్రం తన వ్యవసాయ క్షేత్రం సమీపంలోని నీటి మడుగులో అతడి మృతదేహం కనిపించింది. కాగా ఇంట్లో భార్యాభర్తల గొడవల తర్వాత అతడు కనిపించకుండా పోయాడని తెలిసింది. కాలనీ వాసులు మృతదేహాన్ని బయటకు తీయగా ఈ విషయం పోలీసులకు తెలిసింది. ఎస్సై శ్రవన్‌కుమార్ పోస్టుమార్టం కోసం జనగామ ఏరియా దవాఖానకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య అమీనాబీ, కుమారుడు ఖాసీం, కూతురు కలాంబీ ఉన్నారు.

## నేచురోపతి నర్సింగ్ అసిస్టెంట్‌లో శిక్షణ

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 19 : ఆరోగ్యాన్ని సంరక్షించుకునేందుకు నేచురోపతి నర్సింగ్ అసిస్టెంట్ సేవలు చాలా అవసరమని, దేశంలో వీరి సంఖ్య తగినంత లేనందున నిరుద్యోగులకు జీవనోపాధి కోసం ఇందులో శిక్షణ అందించనున్నట్లు సెంటర్ ఫర్ నేచరల్ హీలింగ్ థెరపిస్టు వ్యవస్థాపకుడు, కన్సలెంట్ కే శ్యాంసుందర్‌రావు తెలిపారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. 6 నెలలు ఉండే ఈ దూరవిద్య కోర్సు ప్రారంభంలో మొదటి మూడు రోజులు స్వయంగా తరగతులకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. శిక్షణలో సెల్ఫ్‌కేర్, హెల్తీ లైఫ్‌స్టైల్, నేచరోపతిలో ఉయోగించే చికిత్సవిధానాలు, డెటోసిఫికేషన్ ఆఫ్ బాడీ, యోగా, ఫ్రీహ్యాండ్ ఎక్సర్‌సైజెస్, ప్రకృతిసిద్ధమైన ఆహార విధానాలు, వెయిట్ రెడ్యూక్షన్ ప్రోగ్రాంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే, ఆరో నెలలో ఏదైనా ఒక ప్రకృతి చికిత్స వైద్యశాల ఇంటర్న్‌షిప్ ఉంటుందని, దీర్ఘకాలిక వ్యాధుల రోగుల వద్ద నర్స్‌గా సేవలందిస్తూ, బరువు తగ్గించే ప్రోగ్రాం ద్వారా, ఇతరులకు శిక్షణ అందించవచ్చని తెలిపారు.

## కాకతీయ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగాధిపతిగా ప్రొఫెసర్ షమిత

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 19 : కాకతీయ విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగాధిపతిగా ప్రొఫెసర్ జీ షమితను నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టీ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ప్రస్తుత విభాగాధిపతి డాక్టర్ మామిడాల ఇస్తారి నుంచి గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. షమిత గతంలో విభాగాధిపతిగా, పాఠ్యప్రణాళిక అధ్యక్షురాలిగా, మహిళా అధ్యయన కేంద్రం సంచాలకులుగా, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్‌గా పనిచేశారు. ప్రస్తుతం కేయూ కేంద్ర గ్రంథాలయ ఇన్‌చార్జిగా, అకడమిక్ ఆడిట్ డీన్‌గా కొనసాగుతున్నారు. ప్రొఫెసర్ షమిత పర్యవేక్షణలో నలుగురు పరిశోధకులు డాక్టరేట్ పూర్తిచేశారు. ఈ సందర్భంగా పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.